సాక్షి
సంగారెడ్డి

సోమవారం । 21 । అక్టోబర్ । 2024



సలాం.. పోలీస్

ప్రజల సంరక్షణే ధ్యేయంగా రాత్రనక.. పగలనక.. పని చేసే ఏకైక వ్యవస్థ పోలీస్. దేశాన్ని కాపాడే వారు సైనికులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసాను ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు. సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా..

అమరులపై ప్రత్యేక కథనాలు.. 8లో..



న్యూస్‌రీల్

ఐటీఐ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: వెనుకబడిన నారాయణఖేడ్ ప్రాంతాన్ని విద్యారంగంలో మొదటి స్థానంలో నిలిపేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు కోసం మండల పరిధిలోని జూకల్ శివారులోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఎదుట 161బీ జాతీయరహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఆదివారం ఆర్డీఓ అశోక చక్రవర్తి, ఆర్ఐ మాధవరెడ్డితో కలిసి 2.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణఖేడ్‌లో ఐటీఐ మంజూరుకి అనువైన స్థలం పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న జూకల్ శివారులో ఆదర్శ డిగ్రీ కళాశాల సమీపంలో ఈ స్థలాన్ని గుర్తించామని తెలిపారు.

ఓటరు నమోదుపై అవగాహన



మాట్లాడుతున్న నిర్మల

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామాల్లో డిగ్రీ 2021కు ముందు పూర్తి చేసిన వారి వివరాలు సేకరించి, ఓటు నమోదు చేయించాలని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల అన్నారు. ఆదివారం ఓటు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. డిగ్రీ పూర్తి చేసిన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు తదితర వాటిపై వివరించాలన్నారు. అభ్యర్థితో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే వారి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆర్ సత్యనారాయణ, సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రునాయక్, నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి వాలీబాల్ విజేత మెదక్



ఉమ్మడి వాలీబాల్ విజేత మెదక్

మెదక్‌జోన్: ఉమ్మడి వాలీబాల్ అండర్ 17 బాల బాలికలకు నిర్వహించిన క్రీడా పోటీలలో బాలుర విభాగంలో మెదక్ జిల్లా జట్టు, బాలికల విభాగంలో సంగారెడ్డి జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించాయి. ఆదివారం మెదక్ కేంద్రంలోని గీతా హై స్కూల్లో మెదక్ సిద్దిపేట సంగారెడ్డి ఉమ్మడి జిల్లాల వాలీబాల్ జట్లకు క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీలలో మెదక్ జిల్లా బాలుర జట్టు అత్యంత ప్రతిభ కనబరిచి సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా జట్లను ఓడించి ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ద్వితీయ స్థానం సిద్దిపేట, తృతీయ స్థానంలో సంగారెడ్డి జిల్లా జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో సంగారెడ్డి జిల్లా జట్టు సిద్దిపేట మెదక్ జిల్లా జట్లపై విజయం సాధించి ప్రథమ బహుమతి సాధించగా సిద్దిపేట ద్వితీయ స్థానం, మెదక్ జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన జట్లకు గీత హై స్కూల్ ప్రిన్సిపాల్ సుగుణాకర్, పాఠశాల క్రీడా సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్ గంగాల, పేట జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, పూర్వ జిల్లా కార్యదర్శి కిషోర్, మాధవ రెడ్డి, చంద్రమోహన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వినోద్ కుమార్, మనోహర్, శేఖర్, దేవేందర్ రెడ్డి, నరేష్ అల్లి, నరేష్ సంగ, పద్మ, అరుణ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు ఎంపికైన అండర్ 17 వాలీబాల్ బాలబాలికలు ఈ నెల 28న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొనడం జరుగుతుందని పాఠశాల క్రీడా సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్ గంగాల తెలిపారు.



జహీరాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు పార్టీ నాయకులు



హత్నూర మండలం దౌల్తాబాద్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం

కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నేతల ధ్వజం

- రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, పాల్గొన్న ఎమ్మెల్యేలు

జహీరాబాద్ టౌన్/హత్నూర(సంగారెడ్డి)/నారాయణఖేడ్/: రైతు భరోసా ఇవ్వాలంటూ ఆదివారం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ.. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని మండిపడ్డారు. ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కాగా, జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్డుపైకి వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాణిక్‌రావు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ మేరకు వానాకాలం సీజన్ రైతు భరోసా నిధులు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్: సునీతారెడ్డి

హత్నూర మండలం దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తాలో చేపట్టిన ధర్నాలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. ప్రజల దృష్టిని మళ్లించడానికి హైడ్రా మూసీ ప్రక్షాళన పేరుతో సీఎం రేవంత్ రెడ్డి డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని సునీతా రెడ్డి భరోసా ఇచ్చారు. కాగా, సంగారెడ్డి నర్సాపూర్ జాతీయ రహదారిపై తెలంగాణ తల్లి చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

నారాయణఖేడ్‌లో..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నారాయణఖేడ్‌లో బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా ధర్నాలు నిర్వహించారు. పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. పట్టణంలోని బసవేశ్వర చౌక్‌లో జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చందర్ ఆధ్వర్యంలో మరో వర్గం బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య



ప్రతాప్‌సింగ్ (ఫైల్)



కళావతి (ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రమైన ఝరాసంగంకు చెందిన ప్రతాప్‌సింగ్(60), కళావతి(50) దంపతులు. గ్రామంలోని కేతకి సంగమేశ్వర ఆలయం ముందు హోటల్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారం సరిగ్గా నడవక.. కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్నారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన దంపతులు.. ఆదివారం గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయి పడి ఉన్నారు. అటు వెళుతున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇంటిగ్రేటెడ్ ఇంతేనా!

- నిరుపయోగంగా మార్కెట్ సముదాయం
- వ్యాపారులకు అప్పగించని దుకాణాలు
- మున్సిపల్ ఆదాయానికి గండి





జహీరాబాద్‌లో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయం, (ఇన్‌సెట్) రోడ్డు పక్కన బిజినెస్ చేసుకుంటున్న వ్యాపారులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కమర్షియల్ కాంప్లెక్స్ దుకాణాల సముదాయ భవనం నిరుపయోగంగా ఉంది. మున్సిపల్ అధికారులు వ్యాపారులకు దుకాణాలు అప్పగించకపోవడంతో జాప్యం చేస్తున్నారు. తాత్కాలిక రేకుల షెడ్డులో ఉన్న కూరగాయల మార్కెట్ సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రూ.12 కోట్లతో జహీరాబాద్ పట్టణంలో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కమర్షియల్ కాంప్లెక్స్ దుకాణాల భవనాన్ని నిర్మించింది. కాంప్లెక్స్‌లో 57 దుకాణాలను నిర్మించగా.. డిసెంబర్ 22 సంవత్సరంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. రూ.2.50 లక్షల చొప్పున డిపాజిట్ తీసుకుని ఫిబ్రవరి 23న వేలం పాట ద్వారా వ్యాపారులకు 53 దుకాణాలను అలాట్ చేశారు. పూర్తి బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్ కాంప్లెక్స్ దుకాణాలను మున్సిపల్ అధికారులకు అప్పగించలేదు. ఫిబ్రవరి 24న మున్సిపల్ సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు జహీరాబాద్ వచ్చిన మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి కాంప్లెక్స్ దుకాణాల సమస్య వెళ్లింది. స్పందించిన మంత్రి.. కాంట్రాక్టర్‌ను పిలిపించి ఆయనతో మాట్లాడారు. బకాయి బిల్లులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చి కాంట్రాక్టర్ నుంచి తాళాలను మున్సిపల్ అధికారులకు అప్పగించారు. ఎనిమిది నెలలు కావస్తున్నా మున్సిపల్ అధికారులు వ్యాపారులకు దుకాణాలను కేటాయించడంలేదు. అధికారుల వైఖరి వల్ల ప్రతి నెల రూ.6 లక్షల వరకు అద్దె రూపంలో ఆదాయానికి గండి పడుతోంది. డిపాజిట్ తీసుకుని దుకాణాలను వ్యాపారులకు అప్పగించక పోవడంతో వారంతా రోడ్డు పక్కనే బిజినెస్ చేసుకుంటున్నారు. దీంతో మున్సిపల్ ఆదాయానికి గండిపడుతోంది. అలాగే.,. ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. వ్యాపారులకు దుకాణాలను అప్పగించాలని బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ఉద్యోగం, ఉపాధికి ఊతం

- ఐటీఐతో పాటు ఏటీసీగా అప్ గ్రేడ్
- జిల్లాలో రెండు సెంటర్ల ఎంపిక
- ఈ నెల 31 వరకు అడ్మిషన్లు
- పలు ప్రత్యేక కోర్సులలో శిక్షణ



సంగారెడ్డిలోని ఐటీఐ కళాశాల

సంగారెడ్డి జోన్: పోటీ ప్రపంచంలో మెరుగైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా ప్రస్తుతం ఉన్న ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ముందుగా జిల్లాలోని రెండు కళాశాలలను ఎంపిక చేసింది. అన్ని వసతులు కల్పిస్తూ, పలు ప్రత్యేక కోర్సులలో శిక్షణ అందించనున్నారు. విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లను ఆధునీకరించి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చేందుకు చర్యలు చేపట్టింది.

- టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో కలిసి ఏటీసీ సెంటర్లు ఏర్పాటు చేస్తుంది. విద్యార్థులకు పలు ప్రత్యేక కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుతం సంగారెడ్డి, హత్నూరలో ఈ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.
- కోర్సులలో అడ్మిషన్ కొరకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఈనెల 31వ తేదీ వరకు అడ్మిషన్లు కొనసాగుతాయి. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో సీట్లు భర్తీ అయ్యాయని అధికారులు వెల్లడించారు.
- ఏటీసీ కోర్సులలో శిక్షణతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కోర్సులు పూర్తి చేసుకున్న వారు నైపుణ్యాన్ని బట్టి వివిధ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగాలు పొందేందుకు దోహదపడుతాయి.
- కోర్సులపై ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 31వ తేదీ వరకు ఎస్ఎస్‌సీ మెమో, టీసీ, కుల ధృవీకరణ పత్రం, బోనఫైడ్ ఆధారు కార్డులతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత తరగతులు ప్రారంభించనున్నట్లు సమాచారం.
- శనివారం కలెక్టరు క్రాంతి అధికారులతో కలిసి ఆయా కళాశాలలను సందర్శించి, వివరాలు తెలుసుకున్నారు. కేంద్రాల నిర్మాణపు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.
- ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న సెంటర్లలో ఆరు కోర్సులపై శిక్షణ అందించనున్నారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేటివ్ (ఒక సంవత్సరం శిక్షణ), ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నిషియన్స్ (ఒక సంవత్సరం శిక్షణ), ఆర్టిషియన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్ (ఒక సంవత్సరం శిక్షణ), బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్-మెకానికల్ (రెండు సం.శిక్షణ), అడ్వాన్స్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నిషియన్ (రెండు సం.శిక్షణ), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ (రెండు సం.శిక్షణ) కోర్సులలో శిక్షణను అందించనున్నారు.

రాయసముద్రంపై నిర్లక్ష్యపు నీడలు



అసంపూర్తిగా వాకింగ్ ట్రాక్

- అభివృద్ధికి నోచుకునేదెన్నడో?
- నామమాత్రంగా వాకింగ్ ట్రాక్
- దృష్టిసారించని పాలకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వాలు మారుతున్నా.. రాయసముద్రంపై నిర్లక్ష్యపు నీడలు తొలగడంలేదు. రామచంద్రాపురం పట్టణంలోని రాయసముద్రం చెరువును అభివృద్ధి చేయడంలో పాలకులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాయసముద్రం చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని కొన్నేళ్లుగా హామీలు గుప్పిస్తున్నారే తప్ప ఆ దిశగా అడుగులు పడటలేదు. ప్రతి ఎన్నికల సమయంలో ఓట్ల కోసం నేతలు 'రాయసముద్రం' అంశాన్ని ముందుకు తెస్తున్నారని, ఆ తరువాత విస్మరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

40 ఎకరాల విస్తీర్ణంలో..

రాయసముద్రం చెరువు సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గతంలో ఈచెరువు కింద వందలాది ఎకరాలలో సాగు జరిగేది. ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందడంతో వ్యవసాయ భూములు కాస్త కాలనీలుగా మారాయి. అనేక కాలనీలు నెలకొనడంతో చెరువులోకి పెద్ద ఎత్తున మురుగు నీరు చేరుతోంది. మురుగును నియంత్రించి సుందరీకరణ చేయడంలో పాలకులు దృష్టిసారించడంలేదు. చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామన్న గత పాలకులు.. కేవలం చెరువు చుట్టూ నామమాత్రంగా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాలకులు ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో వాకింగ్‌ట్రాక్, విద్యుద్దీపాలు, పార్కు, బోటింగ్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెరువును సుందరీకరణ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పర్యాటకంగా తీర్చిదిద్దాలి



రాయసముద్రం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. పూర్తిస్థాయిలో వాకింగ్‌ట్రాక్, బోటింగ్ ఏర్పాటు చేయాలి. ప్రధానంగా చెరువులోకి మురుగు నీరు రాకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి.

– తాళ్ల తిరుమల్ గౌడ్, రామచంద్రారెడ్డినగర్,

అభివృద్ధి చేస్తాం



రామసముద్రం చెరువును జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో సుందరంగా తీర్చిదిద్దుతాం. మినీట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తాం. సీఎస్ఆర్ నిధులతో చెరువును అభివృద్ధి చేయాలని నగర మేయర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశాం.

– పుష్పనగేష్, కార్పొరేటర్



గజరాజుకు పూజలు

సంగారెడ్డి టౌన్: మండలం పరిధిలోని ఫసల్‌వాది శివారులో గల మంజీరా నదిలో జ్యోతిర్ వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో గజరాజు స్నాన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి వైదిక పర్యవేక్షణలో మంజీరా నదిలో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పేకాట స్థావరంపై దాడి

పటాన్‌చెరు టౌన్: పేకాట స్థావరంపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి.. జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో ఆదివారం రాత్రి జూదం ఆడుతున్నారన్న సమాచారంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేశారు. నిషేధిత మూడు ముక్కలాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.91,270లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

38లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం

వన మహోత్సవానికి ఏర్పాట్లు

సంగారెడ్డి టౌన్: పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవ కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా పంచాయతీలలో నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలను పెంచేలా చర్యలు తీసుకుంది. అధికారులు ఇప్పటి వరకు పది విడతలుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. 11వ విడతగా 38లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్దేశించారు.

- జిల్లా వ్యాప్తంగా 631 నర్సరీలు ఉన్నాయి.
- మొత్తం 633 పంచాయతీలు ఉన్నాయి.
- ప్రతి పంచాయతీలో 6వేల మొక్కలు నాటనున్నారు.
- ఉపాధి హామీ, అటవీ శాఖల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేశారు.
- ఈజీఎస్ ఆధ్వర్యంలో 625 గ్రామాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో 8 గ్రామాలలో నర్సరీలు ఉన్నాయి.
- నీళ్లు పట్టేందుకు ఉపాధి హామీ పథకం కింద వన సేవకులను నియమించారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

- 11వ వనమహోత్సవనికి మొక్కలను సిద్ధం చేసేందుకు సంబంధిత అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టారు.
- సారవంతమైన మట్టిని తెచ్చి పాలిథిన్ కవర్లలో నింపి మొక్కలు పెంచుతున్నారు.
- సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గం లోని వివిధ మండలాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలను పెంచుతున్నారు.
- నర్సరీలో రెండు మీటర్ల ఎత్తు పెరిగే కొద్దీ ఒక్కొక్క దానికి 114 రూపాయలు, నాటిన మొక్క రక్షణకు కంచెత్తుతో పెంచించడానికి 190 రూపాయలు, మరో రెండేళ్ల నిర్వహణకు 126 రూపాయలను ఒక్కొక్క మొక్కకు మొత్తంగా 430 రూపాయలు ఖర్చవుతుంది.
- ప్రతి నర్సరీలలో ప్రతి మొక్కకు మూడు మీటర్ల వరకు ఎత్తు ఎదగాలి.
- గ్రామంలో ప్రతి ఇంటికి పూలు, పళ్ల, నీడనిచ్చే ఆరు మొక్కలను అందించేందుకు సిద్ధం చేస్తున్నారు.
- జామ, మామిడి, బత్తాయి వంటి మొక్కలు ఎక్కువగా ఉన్నాయి.



నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

మొక్కలు సిద్ధం చేస్తున్నాం



వచ్చే వనమహోత్సవ కార్యక్రమం నాటికి అన్ని రకాల మొక్కలను సిద్ధం చేస్తున్నాం. లక్ష్యానికి అనుగుణంగా మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. 11వ వన మహోత్సవానికి 38లక్షల మొక్కలను నాటే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– మణికుమార్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్

క్లుప్తంగా

మాకు న్యాయం చేయండి

లక్ష్మీపురం ప్లాట్ యజమానుల డిమాండ్



కొల్లూరు సీఐకి సమస్యను వివరిస్తున్న ప్లాట్ ఓనర్స్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తమకు ప్లాట్లకు చెందిన భూమిని కొందరు అక్రమంగా స్వాధీన పర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కొల్లూరు లక్ష్మీపురం ప్లాట్ యజమానుల అసోసియేషన్ సభ్యులు మూర్తి, రామ్మోహన్ రావు, సుబ్రహ్మణం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ తాము కొన్నేళ్ల క్రితం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో సుమారు 1200మంది ప్లాట్‌లను కొన్నామని తెలిపారు. భూముల విలువ పెరగడంతో కొంత మంది కన్ను తమ ప్లాట్‌కు చెందిన భూములపై పడ్డాయని పేర్కొన్నారు. ఓ రియల్ ఎస్టేట్ సంస్థ తయారు చేసుకున్న ఫోర్జరీ డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీన పర్చుకోవాలన్నారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి



నర్సింహులు (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): బైక్ అదుపు తప్పి కింద పడటంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్-వీరారెడ్డిపల్లి శివారులో చోటుచేసుకుంది. ఆదివారం భూంపల్లి ఎస్‌ఐ హరీశ్ తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. దౌల్తాబాద్ మండలం గాజులపల్లికి చెందిన గొల్లపల్లి చిన్న నర్సింహులు (58) తనకున్న 3 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామంలో పోచమ్మ గుడి నూతన నిర్మాణం కోసం తోటి కులస్తులతో కలిసి శనివారం మెదక్ జిల్లా తుజాల్ పూర్‌లోని గుడి నమూనా తిలకించేందుకు వెళ్లారు. అక్కడే రాత్రి కాగా కులస్తులతో కలిసి తాను తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఖాజీపూర్-వీరారెడ్డి పల్లి గ్రామాల శివారు మలుపు వద్దకు రాగానే భారీగా వర్షం పడటంతో చిన్న నర్సింహులు బైక్ ఒక్కసారిగా అదుపు తప్పడంతో కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలై చిన్ననర్సింహులు అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు తస్కరణ



సిద్దిపేట కమాన్: ఇంటి తాళాలు పగలగొట్టి గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గు వసంత, లింగంగౌడ్ కుటుంబం పట్టణంలోని కుషాల్‌నగర్ ఎల్‌బీసీ కాలనీలో నివాసం ఉంటుంది. లింగం జీవనోపాధి నిమిత్తం మహారాష్ట్ర వెళ్లి అక్కడే ఉంటుండగా.. వసంత తన కూతురుతో కలిసి ఇక్కడే నివాసం ఉంటుంది. గత శుక్రవారం ఇంటికి తాళం వేసి కూతురితో కలిసి ఆమె పుట్టింటికి వెళ్లింది. ఆదివారం ఉదయం పై పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న వారి నుంచి చోరీ విషయం తెలుసుకున్న వసంత ఇంటికొచ్చి చూస్తే బీరువాతో దాచిన మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులు, రూ.7వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. దీంతో పాటు సుమారు. రూ.81వేల విలువైన వస్తువులు సైతం ఎత్తికెళ్లినట్లు సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్ : డిగ్రీ, PG, B.Tech, Diploma, D&B-ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్) GNM, 4 నెలల్లో పరీక్షలు. 8866977112, 339 [HA-15292]

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185485]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ : 18K. Ph: 9160900024 [SCA24000401]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోలీస్.. ఈ పదమే గంభీరం. తెగువకు.. త్యాగానికి పర్యాయం.. పోలీసు విధి నిర్వహణ అత్యంత శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగుల్లా కాకుండా.. ఎండా.. వాన, పగలూ.. రాత్రి అనే తేడా లేకుండా విధులు నిర్వహిస్తుంటారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం. సంపన్నుడు మొదలు.. సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ సాయం కోరేది పోలీసులనే. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడేవారు సైనికులైతే.. అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఎందరో ప్రాణ త్యాగాలు చేయగా, వారిని స్మరించుకునే రోజు వచ్చింది. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా త్యాగధనులపై ప్రత్యేక కథనాలు..



సంగారెడ్డి జోన్: అమరులకు నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు (ఫైల్)

సలాం.. పోలీస్

మీ త్యాగం శ్లాఘనీయం

నేడు అమరవీరుల సంస్మరణ దినం

సంగారెడ్డి జోన్: ప్రతి సంవత్సరం పోలీసు శాఖ ఆధ్వర్యంలో అక్టోబరు 21న పోలీసు అమరుల సంస్మరణ దినం నిర్వహిస్తోంది. 21న అమరులకు ఘన నివాళులు అర్పించి, వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ పలు కార్యక్రమాలు చేపడుతుంది.

● అమరుల కుటుంబాల సంక్షేమంపై దృష్టి

విధి నిర్వహణలోపోలీసులు మృతిచెందగా.. అమరుల కుటుంబాల సంక్షేమంపై పోలీసు శాఖ దృష్టి వహించింది. ఇప్పటి వరకు మృతిచెందిన నలుగురు పోలీసు కుటుంబ సభ్యులకు భూమి, కుటుంబ సభ్యులకు ఉద్యోగంతో పాటు ఆర్థిక సహాయం అందించినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం విధి నిర్వహణలో అమరులైన కుటుంబాలకు రూ.40లక్షల ఆర్థిక సహాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించనున్నారు.

● 21 నుంచి 30 వరకు కార్యక్రమాలు

ఈనెల 21న పోలీసు అమరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 21 నుంచి 30 వరకు కార్యక్రమాలు చేపట్టనున్నారు. కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు. జిల్లాలోని ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించి, పోలీస్‌స్టేషన్ పనితీరు, ఆయుధాలు, నిర్వహణపై అవగాహన కల్పిస్తారు. కళాబృందాల చేత పోలీసు సేవలు, కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు. ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీల నిర్వహణ. పోలీసు సేవలు, అమరుల హోర్డింగ్, ఫ్లెక్సీల ఏర్పాటుతో పాటు సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి అభినందనతో పాటు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించనున్నారు.

అమరుల సేవలు మరువలేనివి



విధి నిర్వహణలో అమరులైన పోలీసు అధికారులు.. ఆ శాఖకు, సమాజానికి అందించిన సేవలు మరిచిపోలేనివి. వారి త్యాగాలను స్మరించుకుంటే ప్రతీ సంవత్సరం అక్టోబరు 21న పోలీసు అమరుల దినంగా జరుపుకొంటాం. వారు భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికి అందించిన సేవలు గుర్తుండిపోతాయి. అమరుల కుటుంబాలు పోలీసు కుటుంబంలో భాగమే. వారి కుటుంబ సభ్యులు పోలీసు శాఖ అన్ని సమయాల్లో అండగా ఉంటుంది. సాయం చేయడానికి ఎప్పుడూ ముందుంటుంది.

– చెన్నూరి రూపేశ్, ఎస్పీ, సంగారెడ్డి



డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం




సీఐ వెంకటస్వామి



హెడ్‌కానిస్టేబుల్ పెంటయ్య



సుజాయత్ అలీ(పీసీ)



లక్ష్మణ్ (పీసీ)




శ్రీనివాస్(పీసీ)

పిల్లుట్ల ఘటనకు 27 ఏళ్లు

శివ్వంపేట(నర్సాపూర్): 1997 నవంబర్ 16న శివ్వంపేట మండలం పిల్లుట్లలో అప్పటి సర్పంచ్ దివంగత గోపాల్‌రెడ్డి ఇంటిని నక్సలైట్లు పేల్చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు గాను శివ్వంపేట నుంచి పిల్లుట్లకు కాలినడకన అటవీ ప్రాంతం గుండా డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నేతృత్వంలో పోలీసులు బయలుదేరారు. నడుచుకుంటున్న వెళ్తున్న క్రమంలో కల్వర్టు కింద అమర్చిన 11 బాంబుల్లో 8 పేలగా మిగతా మూడు పేలలేదు. దీంతో తూప్రాన్ డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటస్వామి, హెడ్‌కానిస్టేబుల్ పెంటయ్య, కానిస్టేబుళ్లు లక్ష్మణ్‌నాయక్, సుజాయత్‌అలీ, శ్రీనివాస్‌తో పాటు ఎదుల్లాపూర్ గ్రామస్తుడు మర్రి నర్సింహారెడ్డి మృతిచెందారు.



నక్సల్స్ బాంబులు పేల్చిన గుట్ట ఇదే



నర్సాపూర్ చౌరస్తా వద్ద దివంగత డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం

తూప్రాన్‌పై బాలసుబ్రహ్మణ్యం ముద్ర

తూప్రాన్: ఐపీఎస్ అధికారి దివంగత బాలసుబ్రహ్మణ్యం సంస్కరణల ఆధ్యునిగా, సమర్థ పోలీసు అధికారిగా మెదక్ జిల్లా తూప్రాన్‌పై తనదైన ముద్రవేశారు. 1996 జులైలో తూప్రాన్ డీఎస్పీగా వచ్చారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతం కావడంతో విధి నిర్వహణలో కచ్చితత్వం పాటిస్తూ స్ట్రిక్ట్ అధికారిగా పేరొందారు. ఈ సమయంలో శివ్వంపేట మండలం పిల్లుట్లో ఓ ఇంటిని నక్సల్స్ పేల్చివేశారు. ఈ ప్రాంతానికి పోలీసులు వస్తారని ఊహించిన నక్సల్స్ 1997 నవంబర్‌లో శివ్వంపేట మండలం పిల్లుట్ల అటవీప్రాంతంలో మందు పాతర అమర్చి పేల్చారు. దీంతో డీఎస్పీ బాల సుబ్రమాణ్యంతో పాటు ఐదుగురు జవాన్లు అమరులు అయ్యారు. అయితే తూప్రాన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు అయ్యేలా చొరవ తీసుకున్నారు సుబ్రహ్మణ్యం. ప్రభుత్వ కళాశాలలో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన జరగాలని సొంత ఖర్చులతో జూనియర్ లెక్చరర్లను ఏర్పాటు చేయించారు. ఆయన చేసిన సేవలకు గాను ఇదే ఏడాది ఆయన స్మారకార్థం నర్సాపూర్ చౌరస్తా కూడలి వద్ద విగ్రహం ఏర్పాటు చేశారు. యేటా అక్టోబర్ 21న పోలీసుల అమరుల దినం నాడు ఆయన విగ్రహానికి కూతురు, రాజకీయ నేతలు పూలమాలలేసి నివాళులర్పిస్తున్నారు.

వారికి సమాజంలో స్థానం ఉండదు



చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారికి సమాజంలో ఎప్పటికైన స్థానం ఉండదు. పిల్లుట్ల అటవీ ప్రాంతంలో నక్సల్స్ దుశ్చర్యకు నా భర్తను కోల్పోవడం నేటికీ మరచిపోలేను. ఆయన మరణానంతరం నాకు ప్రభుత్వం గ్రూప్-2... కమర్షియల్ టాక్స్ ఏసీటీఓగా ఉద్యోగం ఇచ్చారు. పదోన్నతిపై ప్రస్తుతం హైదరాబాద్‌లోని అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నా.

– నాగలక్ష్మి, డీఎస్పీ బాలసుబ్రమణ్యం భార్య

పెద్ద దిక్కు కోల్పోయాం



నక్సల్ చర్యల వల్ల పెద్దదిక్కు కోల్పోయాం. పిల్లుట్ల అటవీ ప్రాంతంలో జరిగిన ఘటన ఇప్పటికీ కళ్ల ఎదుట మెదులుతోంది. పిల్లలు చిన్నగా ఉండడం, నేను పెద్దగా చదువుకోక పోవడంతో హాస్టల్‌లో కుక్ ఉద్యోగం ఇచ్చారు. జిల్లాలోని పలుచోట్ల ఉద్యోగం చేస్తూ ఇద్దరు కూతుర్లు, కొడుకును చదివించి పెళ్లిళ్లు చేశాను. మూడు నెలల క్రితం పదవీ విరమణ పొందాను.

: లక్ష్మి, పెంటయ్య, హెడ్ కానిస్టెబుల్ భార్య



పాపన్నపేట పోలీస్ స్టేషన్

నెత్తుటి మరకలు.. మానని గాయాలు

పాపన్నపేట(మెదక్): నక్సల్స్ నరమేధానికి సరిగ్గా 25 ఏళ్లు. అది 13 సెప్టెంబర్ 1999 తెల్లవారుజాము 1.10 నిమిషాలు. ఊరంతా గాఢ నిద్రలో ఉండగా.. తుపాకీ చేతబట్టి విధులు నిర్వహిస్తున్నారు పోలీసులు. అర్ధరాత్రి ఉప్పెనలా విరుచుక పడ్డ పీపుల్స్ వార్ నక్సలైట్లు హెడ్‌కానిస్టేబుల్ రఘునందన్, కానిస్టేబుళ్లు నర్సింహులు, ఆబిద్ హుస్సేన్, రాంచందర్, ప్రసాద్‌లను పొట్టనబెట్టుకున్నారు. తుపాకుల గర్జనలతో.. బాంబుల మోతలతో పాపన్నపేట పోలీస్ స్టేషన్ దద్దరిల్లింది. నేడు సంస్మరణ దినం సందర్భంగా అమరుల కుటుంబసభ్యులతో సాక్షి పలకరించింది...

నేను చావక ముందే భూమి ఇవ్వండి



● నా భర్తను కోల్పోయాను. కుటుంబ జీవితం ఎలాగూ తిరిగి రాదు. నేను కన్ను మూయక ముందే ప్రభుత్వం ఇస్తానన్న 3 ఎకరాల భూమి ఇవ్వాలి. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. 25 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. సంగారెడ్డిలో ఇచ్చిన ప్లాటు రిజిస్ట్రేషన్ కావడం లేదు. నాకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్ద కొడుకు దివ్యాంగుడు. సంగారెడ్డిలోని డిగ్రీ కాలేజీలో ఉద్యోగం ఇచ్చారు. చిన్నకొడుకు చిరువ్యాపారి. రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చారు.

–పుష్పమ్మ, హెడ్ కానిస్టేబుల్ రఘునందన్ భార్య

చిన్నబిడ్డకు తండ్రి ఎలా ఉంటాడో తెలియదు



● 'నాన్న ఎలా ఉంటాడమ్మా అని చిన్నబిడ్డ నిఖిల అడుగుతుంటే కన్నీళ్లు ఆగటం లేదు.' ఆమె కడుపులో ఉన్నప్పుడే నక్సలైట్లు నా భర్తను పొట్టనబెట్టుకున్నారు. నాకు ఇద్దరు పాపలు. ఒక కొడుకు. అప్పట్లో నాకు పోలీస్ శాఖలో ఉద్యోగం ఇస్తామన్నారు. కానీ ఖాకీ యూనిఫాం చూస్తేనే వెన్నులో వణుకు. అందుకే వద్దన్నాను. ఆ తర్వాత కో-ఆపరేటివ్ బ్యాంకులో ఉద్యోగం ఇచ్చారు. సంగారెడ్డి ఇంద్రానగర్‌లో ఒక ప్లాటు ఇచ్చారు. కానీ మా పేరిట రిజిస్ట్రేషన్ కావడం లేదు.

– నిర్మల, కానిస్టేబుల్ నర్సింహులు భార్య

గర్వంగా భావిస్తున్నా



● మా నాన్న సమాజం కోసం బలిదానం కావడాన్ని అమరత్వంగా భావిస్తున్నా. అవకాశం ఉంటే నేను పోలీస్ శాఖలో ఉద్యోగం చేసేవాడిని. కానీ నాకు ఆరోగ్య శాఖలో ఉద్యోగం ఇచ్చారు. అమ్మ అఫ్సరీ బేగం నాన్న చనిపోయినప్పటి నుంచి మానసిక బెంగతో 10 ఏళ్ల క్రితమే చనిపోయింది. అన్న షౌకత్ సంగారెడ్డిలో పండ్ల వ్యాపారి. తమ్ముడు కైసర్ మెదక్‌లో చిరువ్యాపారి. సంగారెడ్డిలో ఇచ్చిన ప్లాట్ రిజిస్ట్రేషన్ అయ్యింది.

–షౌకత్, ఆబిద్ హుస్సేన్, కానిస్టేబుల్ కొడుకు

ఆయన లేని లోటు పూడ్చలేనిది



● చిన్న వయసులోనే భర్త కోల్పోయాను. అన్నీ ఉన్నా ఆయన లేని లోటు పూడ్చలేనిది. నాకు ఇద్దరు ఆడపిల్లలు. తోడు లేకుండా ఆడపిలలను పెంచి పెద్ద చేయడం ఎంత కష్టమో అందరికీ తెలుసు. మా నాన్న అండతో కొంచెం నిలదొక్కుకున్నాను. ప్రభుత్వం నాకు సంగారెడ్డి జూనియర్ కాలేజీలో ఉద్యోగం ఇచ్చింది. పెద్ద పాప సౌమ్య ఆయుర్వేదిక్ డాక్టర్, చిన్న పాప స్వర్ణమయి బీ ఫార్మసీ. అప్పట్లో పొలం ఇస్తామన్నారు. ఇంకా ఇవ్వలేదు.

– శివలక్ష్మి, రాంచందర్, కానిస్టేబుల్ భార్య

పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోనే ఉద్యోగం



● నా భర్తను పొట్టన బెట్టుకొని నక్సలైట్లు మా కుటుంబానికి పుట్టెడు దు:ఖం మిగిల్చారు. నాకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు విద్యాసాగర్ కు ప్రభుత్వ పరంగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇచ్చారు. చిన్న కొడుకు వివేకా నంద సాగర్ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. మాకు ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని ప్రయోజనాలు సమకూరాయి.

– ప్రమీల, కానిస్టేబుల్ ప్రసాద్ భార్య



పాపన్నపేట పీఎస్‌లో ఏర్పాటు చేసిన అమరుల స్తూపం

ప్రాణత్యాగాలు మరువలేం

మెదక్ మున్సిపాలిటీ : నేటి నుంచి జిల్లాలో పోలీసు అమరుల సంస్మరణ (పోలీస్ ఫ్లాగ్‌డే) దిన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా పరిధిలో పోలీస్ అమరుల ప్రాణత్యాగాల స్మరణలో భాగంగా అక్టోబర్ 21న పోలీస్ అమరుల సంస్మరణ దిన 'పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

● ఆన్‌లైన్‌లో పోటీలు

విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నాం. ఇంటర్ విద్యార్థులకు విచక్షణతో కూడిన మొబైల్ వాడకం, డిగ్రీ, పీజీ విద్యార్థులకు తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాలపై ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నాం. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గరికి బహుమతుల ప్రధానంతోపాటు రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తాం.

● పోలీసులకు సైతం



ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ స్థాయి అధికారి వరకు సమాజంలో పోలీసు ప్రతిష్టను మెరుగుపరచడంలో నా పాత్ర, ఎస్.ఐ స్థాయి, పై స్థాయి అధికారులకు దృఢమైన శరీరంలో దృఢమైన మనసు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తాం. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఉంటాయి. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి అవార్డుల ప్రధానంతోపాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత లభిస్తుంది.

● రక్తదాన శిబిరాలు

సైకిల్ ర్యాలీతోపాటు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తాం. యువత అధిక సంఖ్యలో పాల్గొనాలి. పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అమరులను స్మరిస్తూ ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పిస్తారు.

● కళాబృందాల ప్రదర్శనలు

నేటి నుంచి ఈనెల 31వ తేదీ వరకు జిల్లాలోని పలు పబ్లిక్ స్థలాల్లో, పోలీస్ అమరుల గురించి తెలుపుతూ పోలీస్ కళా బృందంతో పాటలు పాడే కార్యక్రమాలు ఉంటాయి. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ అమరుల బ్యానర్లను ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు.

సచ్చాక బెనిఫిట్స్ ఇస్తారా?



మెదక్‌జోన్: కొడిపల్లి మండలం ధర్మాసాగర్‌లో 1991లో నక్సలైట్లకు పోలీసులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో నా భర్త ఎస్సై దామోదర్ రెడ్డి మరణించారు. అప్పుడు 5 ఎకరాల భూమితో పాటు 500 గజాల ఇంటి స్థలం ఇస్తామన్నారు. నేటికీ బెన్‌ఫిట్స్ ఇవ్వడం లేదు. నేను బతికుండగా ఇవ్వని బెన్‌ఫిట్స్ సచ్చాక ఇస్తారా?.. ఆయన చనిపోయాక పెద్దకుమారుడు ప్రవీణ్ కుమార్‌రెడ్డి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటలిజెన్స్ సీఐ. ఎంత చెప్పినా వినకుండా పోలీస్ ఉద్యోగంలో చేరాడు. ప్రస్తుత ప్రభుత్వం అయినా బెనిఫిట్స్ ఇచ్చి ఆదుకోవాలి.

– జ్యోత్స్న, ఎస్‌ఐ దామోదరరెడ్డి భార్య



జాన్ విల్సన్ విగ్రహం వద్ద పోలీసు అధికారులు నివాళులు (ఫైల్)

ప్రజా హృదయాలను గెలిచిన జాన్‌విల్సన్

హుస్నాబాద్: అప్పుడు పీపుల్స్‌వారు ప్రాబల్యం కొనసాగుతున్న సమయంలో 1990లో జాన్ విల్సన్ హుస్నాబాద్ ఎస్సైగా బదిలీ పై వచ్చారు. ఠాణా మెట్లు ఎక్కని ఎందరో అభాగ్యులు ఆయన వచ్చాక స్టేషన్‌కు వచ్చి సమస్యలు చెప్పుకునే వారు. ఆర్టీసీ బస్సు దహనం కేసు దర్యాప్తు కోసం 1991, డిసెంబర్, 19న అక్కన్నపేట మండలం రామవరానికి హుస్నాబాద్ ఇన్‌చార్జి సీఐ యాదగిరితోపాటు ఎస్‌ఐ జాన్ విల్సన్‌తోపాటు 13 మంది బస్సులో వెళ్లారు. ఆర్టీసీ బస్సు దహనం కేసుకు సంబంధించి పంచనామా చేసుకొని తిరిగొస్తుండగా రామవరం శివారులో పీపుల్స్ వారు మందుపాతర పేల్చారు. ఈ ప్రాంతానికి పోలీస్‌లు వస్తారని కాపుకాశారు. మందుపాతరకు బస్సు ముక్కలై సీఐ యాదగిరి, ఎస్సై జాన్ విల్సన్‌తో పాటు మరో 13 మంది అక్కడికక్కడే మృతిచెందారు.

పెళ్లి కార్డు ఇచ్చేందుకు వచ్చి..

వారం రోజుల్లో తన పెళ్లి ఉండగా కార్డులు ఇచ్చేందుకు ఎస్సై జాన్ విల్సన్ హుస్నాబాద్ వచ్చారు. ఇదే రోజు రాత్రి రామవరంలో బస్సు దహన సంఘటన చోటుచేసుకుంది. పంచనామా కోసం హుస్నాబాద్ ఇన్‌చార్జి సీఐ యాదగిరితో కలిసి జాన్ విల్సన్ బస్సులో రామవరానికి వెళ్లారు. తిరిగొస్తుండగా నక్సల్స్ పేల్చిన మందుపాతరలో మృత్యువాత పడ్డారు.

పేదల పక్షపాతిగా పేరు

ఏడాదిన్నర పాటుగా హుస్నాబాద్ ఎస్సైగా పనిచేసిన జాన్ విల్సన్ అతి తక్కువ కాలంలోనే పేదల పక్షపాతిగా పేరు సంపాదించుకున్నారు. పేద ప్రజల కన్నీళ్లు తుడిచి వారి బాధలను పంచుకుంటూ ఎంతో మంది అభాగ్యులకు అండగా నిలిచారు. ఏ ఆపద వచ్చినా తాను ఉన్నానంటూ భరోసానిచ్చారు. స్థానికులు ఆయన పేరిట ట్రస్ట్ నిర్వహిస్తూ పలు సామాజిక కార్యక్రమాలను చేస్తున్నారు.